నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 11-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 261 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పారదర్శకత కోసం వార్షిక నివేదిక: కేటీఆర్

హైదరాబాద్ , జూన్ 10:సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతిపథంలో దూసుకెళ్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ విధానాలు, సమష్టి కృషితోనే ఇది సాధ్యమయ్యిందన్నారు. హైదరాబాద్ లో పరిశ్రమలు, ఐటీ శాఖ వార్షిక నివేదికలను మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం దార్శనికతతో దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతున్నామని చెప్పారు. పారదర్శకత కోసం వార్షిక నివేదికలు విడుదల చేస్తున్నామని తెలిపారు. 2020-21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.9.78 లక్షల కోట్లుగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో 20.9 శాతం వృద్ధి సాధించామని మంత్రి తెలిపారు.

దేశ తలసరి ఆదాయం రూ.1,27,768గా ఉండగా, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,27,145గా ఉందన్నారు. 2019-20లో రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.1.28 లక్షల కోట్లు కాగా, 2020-21లో అవి రూ.1.45 లక్షల కోట్లకు పెరిగాయని చెప్పారు. ఐటీలో దేశంతో పోలిస్తే రెట్టింపు వృద్ధి సాధించామన్నాని వివరించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 3.23 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని, ఏడేళ్ల తర్వాత ఆ సంఖ్య రెట్టింపయ్యిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ఐటీ రంగం 6.28 లక్షలకుపైగా ఉద్యోగాలు కల్పిస్తున్నదని చెప్పారు. సుమారు 20 లక్షలకుపైగా మంది ఐటీ రంగంపై ఆధారపడి పనిచేస్తున్నారని కేటీఆర్ చెప్పారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను కేంద్రం ఆదుకోవాలని కోరారు. దీనికోసం రూ.20 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఏరోస్పేస్ సిటీస్ కేటగిరిలో హైదరాబాద్‌కు తొలి ర్యాంకు

హైదరాబాద్ , జూన్ 10: ఎఫ్‌డీఐ ఏరోస్పేస్ సిటీస్ ఆఫ్ ద ఫ్యూచర్ 2020-21 ర్యాంకింగ్స్ గురించి మంత్రి కేటీఆర్ చెబుతూ.. వ్యయ సమర్థత విషయంలో టాప్ 10 ఏరోస్పేస్ సిటీస్ కేటగిరిలో హైదరాబాద్ తొలి ర్యాంక్‌లో నిలిచిందని వెల్లడించారు. గురువారం పరిశ్రమలు, ఐటీ శాఖల వార్షిక నివేదికలను ఆయన విడుదల చేశారు. జాతీయ స్థాయిలో 2019 ఏడాదికిగాను సులభతర వాణిజ్యంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచినట్లు చెప్పారు.

ఇక నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇండియా ఇన్నోవేషన్ ఇండెక్స్ రిపోర్ట్‌లో ప్రధాన రాష్ట్రాల కేటగిరీలో రాష్ట్రానికి నాలుగోస్థానం దక్కినట్లు తెలిపారు. ఇక ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీవో) 28వ కన్వర్జెన్స్ ఇండియా 2021 ఇంటర్నేషన్ ఎగ్జిబిషన్, 6వ స్మార్ట్ సిటీస్ ఇండియా ఎక్స్‌పోలో హైదరాబాద్‌కు మూడు స్మార్ట్ సిటీస్ ఇండియా (ఎస్‌సీఐ) అవార్డులు దక్కినట్లు కేటీఆర్ చెప్పారు. గ్రీన్ అండ్ క్లీన్ సిటీ, స్మార్ట్ వేస్ట్ డిస్పోజల్, స్టార్టప్ కేటగిరీల్లో ఈ అవార్డులు వచ్చినట్లు తెలిపారు.

ముంబైలో భారీ వర్షాలు

ముంబయి, జూన్ 10:దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి.

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ముంబైలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో ముంబై జలమయమైంది. రాబోయే నాలుగురోజుల పాటు ముంబైలో భారీవర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ముంబై నగరంతోపాటు శివారు ప్రాంతాలు, థానే, పాల్ఘార్, రాయ్‌గడ్ జిల్లాల్లో వచ్చే భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఐఎండీ 'ఆరంజ్ అలర్ట్' జారీ చేసింది.

భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశారు. పాల్ఘార్‌లో వంతెన సైతం కూలింది.

భారీవర్షాలతో పలు ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు కరోనాతో అల్లాడిన ముంబై వాసులకు భారీ వర్షాలు వణికిస్తున్నాయి.

శ్రీ డింకో సింహ్ కన్నుమూత పట్ల సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 10:బాక్సర్ శ్రీ డింకో సింహ్ కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

"శ్రీ డింకో సింహ్ క్రీడల లో ఓ సూపర్ స్టార్, అనేక సాఫల్యాలను సంపాదించిన శ్రేష్ఠుడైన బాక్సర్. అంతే కాదు, బాక్సింగ్ కు ప్రజాదరణ ఇంతలంతలు కావడానికి ఆయన తోడ్పాటు ను అందించారు కూడాను. ఆయన మరణ వార్త దు:ఖాన్ని కలిగించింది. ఆయన కుటుంబానికి, ఆయన ను అభిమానించే వారికి ఇదే నా సంతాపం. ఓమ్ శాంతి." అని శ్రీ నరేంద్ర మోదీ ఒక ట్వీట్ లో పేర్కొన్నారు.

మెడికల్ హబ్‌గా మహబూబాబాద్ : మంత్రి సత్యవతి

మహబూబ్‌నగర్, జూన్ 10:రాష్ట్రంలో పేద ప్రజలకు ప్రభుత్వ రంగంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ అదనంగా 10వేల కోట్ల రూపాయలను కేటాయించారు. దీంతో వైద్యారోగ్య రంగానికి మహర్దశ పట్టిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్‌కు మంజూరు చేసిన మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలకు కేటాయించిన స్థలాన్ని, నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి మాట్లాడారు.

ప్రైవేట్ హాస్పిటళ్లకు దీటుగా ప్రభుత్వ హాస్పిటళ్లు అన్ని విధాల బలోపేతం కానున్నాయని ఆమె తెలిపారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మహబూబాబాద్ మెడికల్ హబ్ గా మారిందన్నారు.

మానుకోటకు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, టీచింగ్ హాస్పిటల్, ఆక్సిజన్ ప్లాంట్ వచ్చాయి. ఇటీవలే 2.73 కోట్ల రూపాయలతో టి. డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభించుకున్నాం. వీటన్నింటి వల్ల ఇక్కడి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహబూబాబాద్ మీదుగా కేంద్రం నుంచి మూడు జాతీయ రహదారులు వచ్చాయి. గ్రీన్ ఫీల్డ్ లో రోడ్డుకు సంబంధం లేకుండా నాగపూర్ నుంచి మచిలీపట్నం వరకు జిల్లా బైపాస్ గా జాతీయ రహదారి వస్తుందని తెలిపారు. భద్రాచలం నుంచి వయా తిరుమలగిరి, వలిగొండ, హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి వచ్చింది. కోదాడ నుంచి కొరివి వరకు వచ్చే లింక్ కలిపే జాతీయ రహదారికి నిధులు వచ్చాయి. ఇవన్నీ రావడంతో జిల్లా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.

భవిష్యత్ లో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కాలేజీ వచ్చి జిల్లా రూపురేఖలు మారబోతున్నాయి. ఈ ప్రాంతంలో వాణిజ్య పంటలు ఎక్కువ పండుతున్నాయి. ఇప్పటికే రెండు ప్రాసిసెంగ్ కేంద్రాలు వచ్చాయి. తద్వారా ఈ ప్రాంతంలో మిర్చి రైతులకు మంచి ధరలు వస్తున్నాయి.

మిగిలిన వాణిజ్య పంటలను ప్రోత్సహించి రైతులకు లాభం చేకూర్చే విధంగా ప్రయత్నం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కలెక్టరేట్ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో ఎంపీ మాలోతు కవిత, జడ్పీ చైర్ పర్సన్ కుమారి బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, కలెక్టర్ వి.పి గౌతమ్ ఉన్నారు.

వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్ , జూన్ 10: వరద ఉన్నప్పుడే జూరాల పై ఆధారపడిన ప్రాజెక్టులను నింపి రైతులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని మఖ్తల్ భీమా ఫేస్ 2 పంప్ హౌస్ నుంచి చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కు నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ముందస్తుగా వరద రావడం అత్యంత ఆశాజనకంగా ఉందని ఆయన తెలిపారు.

రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజిర్ శివ ధర్మతేజ, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, పసుపుల దత్తు, శేఖర్ రెడ్డి, అధికార ప్రతినిధి రామలింగం, కె. నేతాజీ రెడ్డి, జి.ఈశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యాసంస్థలు ప్రారంభం... క్లాసులు ఎప్పుడుంటే..

హైదరాబాద్ , జూన్ 10:తెలంగాణలో విద్యాసంస్థల ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 16 నుంచి ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. 8వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించనున్నారు. గతేడాదిలాగే విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కరోనా వ్యాప్తి తగ్గ ముఖం పడితే వచ్చే నెల(జులై)లో రోజు విడిచి రోజు స్కూళ్లు నడిపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా ఉధృతి పూర్తిగా తగ్గింది. ప్రతిరోజు రెండు వేల లోపు కేసులే నమోదు అవుతున్నాయి. దీంతో జులై నెలాఖరు వరకు కరోనా తగ్గుతుందని.. స్కూళ్లను సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పుగలూరు-త్రిసూర్ మధ్య వీఎస్‌సీ ఆధారిత పవర్‌లైన్ ప్రారంభం

హైదరాబాద్ , జూన్ 10: దక్షిణ భారత దేశంలో విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం అయ్యింది. తమిళనాడులోని పుగలూరు.. కేరళలోని త్రిసూర్ మధ్య వోల్టేజ్ సోర్స్ కన్వర్టర్(వీఎస్‌సీ) ఆధారిత హై వోల్టేజ్ డైరక్ట్ కరెంట్ సిస్టమ్(హెచ్‌వీడీసీ) పవర్‌లైన్ వాణిజ్య వినియోగం మొదలుపెట్టింది. ఈ రెండు స్టేషన్ల మధ్య వీఎస్‌సీ పద్ధతిలో 2000 మెగా వాట్ల విద్యుత్తు సరఫరా కానున్నది. మోనోపోల్-2 ప్రాజెక్టును ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన ప్రధాని మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. మోనోపోల్-1 ఇప్పటికే పూర్తి స్థాయిలో కమర్షియల్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నది. పుగలూరు-త్రిసూరు మధ్య హెచ్‌వీడీసీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.5070 కోట్ల ఖర్చు అయ్యింది. రాయిఘర్-పుగలూరు-త్రిసూర్ 6000 మెగావాట్ల హెచ్‌వీడీసీస వ్యవస్థలో భాగంగా మోనోపోల్-2ను ప్రారంభించారు. హెచ్‌వీడీసీ వ్యవస్థ ద్వారా కేరళకు రెండు వేల మెగా వాట్ల విద్యుత్తును అందించనున్నారు. అత్యాధునిక వీఎస్‌సీ టెక్నాలజీని పవర్‌గ్రిడ్ సంస్థ ఈ ప్రాజెక్టు ద్వారా ఇండియాలో ప్రవేశపెట్టింది. సాంప్రదాయహెచ్‌వీడీసీ వ్యవస్థతో పోలిస్తే వీఎస్‌సీ టెక్నాలజీకి అతి తక్కువ స్థాయిలో భూ వినియోగం అవసరం వస్తుంది. ఓవర్‌హెడ్ లైన్‌తో పాటు అండర్ గ్రౌండ్ కేబుల్‌ను ఏర్పాటు చేయడం ఈ వ్యవస్థలో ప్రత్యేకం. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగానే ఈ ప్రాజెక్టు అనేక స్వదేశీ కంపెనీలు విద్యుత్తు పరికరాలను సరఫరా చేశాయి.

మొబైల్ ఐసీయూ బస్సులను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, జూన్ 10: : కొవిడ్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొస్తున్నది. ప్రభుత్వ చర్యలకు మద్దతుగా పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో వెరాస్మార్ట్ హెల్త్ కేర్ సహకారంతో లార్డ్స్ చర్చి అందజేసిన మొబైల్ ఐసీయూ బస్సులను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం రోటరీ నగర్ లో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. కొవిడ్ లాంటి పరిస్థితుల్లో మెడికల్ యూనిట్ బస్సులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కొవిడ్ వల్ల ఆరోగ్య సిబ్బంది గొప్పతనం అందరికీ తెలిసిందన్నారు. దేవుడితో సమానంగా హెల్త్‌కేర్ వర్కర్లను చూస్తున్నారని పేర్కొన్నారు. మెడికల్ మొబైల్ బస్సులను అందించిన లార్డ్స్ చర్చికి మంత్రి పువ్వాడ కృతజ్ఞతలు తెలిపారు.

కాగా, తొలి విడుత రాష్ట్రంలో 30 బస్సులను ప్రారంభించినట్లు లార్డ్స్ చర్చి ప్రతినిధులు అబ్రహం, రమేష్ లు వెల్లడించారు.

అందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు 2 బస్సులను కేటాయించామని తెలిపారు. మెడికల్ యూనిట్ బస్సులో వైద్య సేవల కోసం ఒక ల్యాబ్, ఒక డాక్టర్, ఇద్దరు నర్సులతో పాటు ఆక్సిజన్ తో కూడిన 10 బెడ్లు ఏసీ సౌకర్యంతో అందుబాటులో ఉంటాయని వారు మంత్రికి వివరించారు.

కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ డీఎంహెచ్‌వో మాలతి సందీప్, పాస్టర్ సత్యపాల్ కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

రాష్ట్రమంతా విస్తరించిన నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్ , జూన్ 10:నైరుతి రుతుపవనాలు తెలంగాణ అంతా విస్తరించినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు విస్తరించిన విషయం విదితమే. ఉత్తర బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. రేపు ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. రాగల 24 గంటల్లో మరింత బలపడి ఒడిశా మీదుగా వెళ్లే అవకాశం ఉంది. పశ్చిమ దిశ నుంచి రాష్ట్రంలోకి గాలులు వీచనున్నాయి. రాగల మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ, రేపు ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు, ఇవాళ ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఏపీలో కొనసాగుతున్న కరోనా వ్యాప్తి..కొత్తగా 8110 పాజిటివ్ కేసులు

అమరావతి, జూన్ 10:ఏపీలో అదే స్థాయిలో కరోనా కేసులు నమోదు అవుతున్నాయి.

గడిచిన 24 గంటల్లో మొత్తం 97,863 సాంపిల్స్ ని పరీక్షించగా 8,110 మంది కోవిడ్ 19 పాజిటివ్ గా నిర్ధారింఎ బడ్డారు.

అలాగే కోవిడ్ వల్ల చిత్తూర్ లో పదకొండు మంది, పశ్చిమ గోదావరి లో తొమ్మిది, విశాఖపట్నం లో ఏడుగురు, తూర్పు గోదావరి లో ఆరుగురు, శ్రీకాకుళం లో ఆరుగురు, విజయనగరం లో ఆరుగురు, గుంటూరు లో ఐదుగురు, కర్నూల్ లో ఐదుగురు, అనంతపూర్ లో నలుగురు, కృష్ణ లో నలుగురు, వైఎస్ఆర్ కడప లో ముగ్గురు మరియు నెల్లూరు లో ఒక్కరుమరణించారు.

ఇక గడచిన 24 గంటల్లో 12,981 మంది కోవిడ్ నుండి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 2,01,37,627 సాంపిల్స్ ని పరీక్షించడం జరిగింది.

ఈటల రాజేందర్‌పై గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్

హైదరాబాద్ , జూన్ 10: మాజీ మంత్రి ఈటల రాజేందర్‌పై శాసనమండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈటల తనని తాను రాజకీయంగా నాశనం చేసుకున్నారు. రాజకీయాల్లో ఆత్మహత్యలే తప్ప.. హత్యలుండవు అని గుత్తా అన్నారు. ఈటలకు సీఎం కేసీఆర్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. దేశ వ్యాప్తంగా మోదీ గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఆస్తుల రక్షణ కోసమే ఈటల బీజేపీలోకి వెళ్తున్నారు. ఉప ఎన్నికలో ఈటల ఓడిపోవడం ఖాయమన్నారు. మరో 20 ఏండ్లు టీఆర్ఎస్ పార్టీ అధికారంలోనే ఉంటుందన్నారు. 2026 ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుతాయన్నారు. నియోజకవర్గాల డి-లిమిటేషన్ 2026లో పూర్తవుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట: కుటుంబ సభ్యులకు కరోనా సోకితే 15 రోజుల లీవ్

న్యూఢిల్లీ, జూన్ 10:కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం ఊరటనిచ్చే వార్త చెప్పింది. వారికి 15 రోజుల పాటు స్పెషల్ క్యాజువల్ లీవ్ (ఎస్‌సీఎల్)ను ఇస్తున్నట్లు ప్రకటించింది.

ఉద్యోగులకు చెందిన తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు ఎవరైనా సరే కోవిడ్ బారిన పడితే వారికి 15 రోజుల పాటు ఆ సెలవు ఇస్తారు. ఈ మేరకు సంబంధిత మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఒత్తిడి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఇక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే స్వయంగా కోవిడ్ బారిన పడితే 20 రోజుల పాటు ఆ సెలవును అందిస్తామని తెలిపింది.

సెప్టెంబర్ 15 వరకు పద్మ అవార్డుల నామినేషన్ల స్వీకరణ

న్యూఢిల్లీ, జూన్ 10: పద్మ అవార్డులు-2022 నామినేషన్లను 15 సెప్టెంబర్,2021 వరకు స్వీకరించనున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. పద్మ అవార్డుల నామినేషన్లు, సిఫార్సులు ఆన్‌లైన్‌లో పద్మ అవార్డుల పోర్టల్ https://padmaawards.gov.in లో మాత్రమే స్వీకరించబడతాయని పేర్కొంది.పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటి. 1954 లో పద్మ అవార్డులను స్థాపించారు. ఈ అవార్డులు ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించబడతాయి. ఈ అవార్డు 'వర్క్ ఆఫ్ డిస్టింక్షన్' ను గుర్తించటానికి ప్రయత్నిస్తుంది.కళలు, సాహిత్యం, విద్య, ఆటలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ వంటి అన్ని రంగాలలో విశిష్టమైన, అసాధారణమైన విజయాలు / సేవలకు ఈ అవార్డు ఇవ్వబడుతుంది. కాగా వైద్యులు, శాస్త్రవేత్తలు తప్ప పీఎస్‌యూలతో పనిచేసే వారితో సహా ప్రభుత్వ ఉద్యోగులు పద్మ అవార్డులకు అర్హులు కాదు.

చరిత్రలో నేటినిజం

మానసిక రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు?

అమరావతి, జూన్ 10:కరోనాకు సంబంధించి ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కరోనా నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేయాలని, ఎక్కువ పరీక్షలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. కరోనా, బ్లాక్ ఫంగస్ కేసులు, వ్యాక్సినేషన్ వంటి అంశాలపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏపీలో మూడో దశ కరోనా వ్యాప్తి జరిగితే దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే ఏపీలో 26,325 మంది వైద్య, ఇతర సిబ్బందిని నియమించామని తెలిపింది. 1300 కి పైగా యాక్టివ్ బ్లాక్ ఫంగస్ కేసులు ఉన్నాయని వివరించింది. అలాగే, మూడో దశ కరోనా వ్యాప్తి జరిగితే పిల్లలకు భారీగా సోకుతుందన్న అంచనాలు నిర్ధారణ కాలేదని ప్రభుత్వం తెలిపింది.

ప్రభుత్వ వాదన అనంతరం.. కరోనా నియంత్రణకు ప్రభుత్వం సమర్థంగా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. ఒప్పంద నర్సులకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని చెప్పింది. కరోనా వేళ మానసిక రోగులకు ఎలాంటి వైద్య చికిత్సలు అందిస్తున్నారని కోర్టు ఆరా తీసింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. కరోనా నివారణ చర్యలపై విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

హస్తినలో ఏపీ సీఎం జగన్

అమరావతి, జూన్ 10:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీకి బయల్దేరారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. సీఎం జగన్ తో పాటు వైసీపీ ఎంపీలు అయోధ్య రామిరెడ్డి, మిథున్‌రెడ్డి, అవినాశ్ రెడ్డి, బాలశౌరి తదితరులు ఉన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఆయన ఢిల్లీ చేరుకుంటారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతోపాటు జల వనరుల శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు సహా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాగా, వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం జగన్ ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది.

ఎంజీఎంకు 100 ఆక్సిజన్ ఫ్లో మీటర్లు అందజేత

వరంగల్, జూన్ 10: ఎంజీఎం దవాఖాన లో కరోనా వైద్య సేవల మెరుగు కోసం గ్రేటర్ వరం గల్ 13వ డివిజన్ కార్పొరేటర్ సురేశ్‌జోషి ఆక్సిజన్ ఫ్లో మీటర్లు అందజేశారు. బుధవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ చాంబర్‌లో ఆక్సిజన్ ఫ్లో మీటర్లను అందజేశారు. కరోనా కాలం లో ఎంజీఎం దవాఖానలో అందుతున్న సేవలను గుర్తించి వాటిని మరింత మెరుగుపరచడానికి వరం గల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సూచ నల మేరకు స్థానిక దాతల సహకారంతో 100 ఆక్సి జన్ ఫ్లో మీటర్లు అందిస్తున్నామన్నారు. వైద్యానికి అవసరమైన ఫ్లో మీటర్లు ఇచ్చేందుకు సహాయ, స హకారాలు అందించిన దాతలకు ఆయన కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆసీఫ్, ఠాకూర్ రాజేందర్ సింగ్, ఠాకూర్ రవీందర్‌సింగ్, షేక్ బాబా, ప్రశాంత్, నెల్సన్ పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే సీఎం కేసీఆర్ లక్ష్యం

ములుగు, జూన్ 10 : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ ఆరోగ్యరంగం మౌలిక వసతుల కల్పనతో బలోపేతం అవుతున్నదని, అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. బుధవారం ములుగు జిల్లా ప్రభుత్వ దవాఖానలో రూ.3కోట్లతో ఏర్పాటుచేసిన టీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఆ తర్వాత సెంటర్‌లోని అత్యాధునిక యంత్రాలను పరిశీలించి వాటి పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొని స్వయంగా రక్తపరీక్ష చేయించుకున్నారు. అంతకుముందు గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించి ఆలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు 19 డయాగ్నస్టిక్ సెంటర్లను ప్రారంభించడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన దాని కంటే అదనంగా రూ.10వేల కోట్లను ఆరోగ్య రంగంలో ఖర్చు పెట్టడంతో వైద్యరంగం దశ, దిశ మారనుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అందరికీ హెల్త్ ప్రొఫైల్ ఉండాలనే ఆలోచనలతో సీఎం కేసీఆర్ ములుగు జిల్లాతో పాటు సిరిసిల్ల జిల్లాను మోడల్ జిల్లాగా ప్రకటించి జిల్లాపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు.

ములుగు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా, గిరిజన బిడ్డగా సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. హెల్త్ ప్రొఫైల్ వివరాలు ఉన్నట్లయితే సరైన సమయంలో సరైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని అన్నారు. త్వరలో గుండె సంబంధిత పరీక్షలను సైతం టీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పేద ప్రజలకు ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యల వల్ల రాష్ట్రంలో ఇప్పటికే కరోనా తగ్గుముఖం పట్టిందని, అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండి జీరోస్థాయికి తీసుకురావాలని అన్నారు. కరోనాను పూర్తిగా కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

హెల్త్ ప్రొఫైల్‌తో ఎంతో మేలు.. ఎంపీ మాలోత్ కవిత

హెల్త్ ప్రొఫైల్‌తో ద్వారా ప్రజల సంపూర్ణ ఆరోగ్య వివరాలను వైద్యులతో పాటు కుటుంబ సభ్యులకు తెలిసే అవకాశం ఉందని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయడంలో భాగంగా సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్య శాఖకు అధిక నిధులు కేటాయిస్తూ ఉచిత వైద్యం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. తన నియోజకవర్గ పరిధిలో మానుకోట, ములుగు జిల్లాలో రెండు టీ డయాగ్నస్టిక్ సెంటర్లను ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఐటీడీఏ పీవో హన్మంత్ జెండగే, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య పాల్గొన్నారు.

చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకుందాం !

(3వ కరోనా వేవ్ వస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో)

కోవిడ్-19 మహమ్మారి రెండవ అలకు లక్షల ప్రాణాలు గాల్లో కలిశాయి. వృద్ధులతో పాటు 30 - 50 ఏండ్ల యువత/నడివయస్కులు కూడా రెండవ అల వలలో చిక్కి ప్రాణాలు కోల్పోయారు. రెండవ అలకు కారణమైన డెల్టా వేరియంట్ వేగంగా వ్యాపించడం, కొద్ది రోజుల్లోనే తీవ్ర అనారోగ్యం పాలుకావడం వెంట వెంటనే జరిగాయి. ఆసుపత్రి పడకలు, వెంటిలేటర్లు, ఐసియూలు, ఆక్సీజన్ సిలిండర్లు, ఔషధాల కోరతతో వేల ప్రాణాలు కాపాడలేని నిస్సహాయ స్థితులను చూశాం. భారతదేశవ్యాప్తంగా రాష్ట్రాలు విధించిన లాక్‌డౌన్‌లతో 2వ అల కొంత తగ్గుముఖం పట్టిందని ఊరట చెందుతున్నాం. మరి కొన్ని రోజుల్లో రెండవ అల తీవ్రత తగ్గి, ప్రజలకు కొంత ఉపశమనం కలుగవచ్చు. కరోనా 2వ అల అంతంకాదని, నవంబర్-డిసెంబర్, 2021లో 3వ వేవ్ రావచ్చన్న నిపుణుల హెచ్చరికలు ప్రతి ఒక్కరిని భయకంపితులను చేస్తున్నది. యూకెలో 2వ అల నుంచి 3వ అల వ్యాప్తి చెందడానికి 8 వారాలు, ఇటలీలో 17 వారాలు, యూయస్‌లో 23 వారాల సమయం పట్టింది. మన దేశంలో జూన్-జూలైలలో 2వ అల తగ్గడం జరుగవచ్చని, 3వ అల రావడానికి దాదాపు 16 వారాలు తీసుకోవచ్చని, ఇదే నిజమైతే నవంబర్ చివరలో లేదా డిసెంబర్-2021లో రావచ్చని వింటున్నాం. 3వ వేవ్ రాకపోవచ్చని వాధించే వారు కూడా లేకపోలేదు. ఏది ఏమైన 2వ అల సృష్టించిన సునామీ గుణపాఠంతో 3వ అల వస్తుందనే నమ్మకంతో దానిని తట్టుకోవడానికి తగు ఏర్పాట్లు వెంటనే చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు వైద్యరంగంపై ఉన్నది. 3వ అల కల్లోలంలో పిల్లలు కూడా ప్రమాదంలో పడవచ్చనే హెచ్చరికలు పరిస్థితులను మరింత జటిలం చేయనున్నాయి.

3వ వేవ్ రాక ముందే టీకా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున తీసుకోవలసి ఉంది. వివిధ రాష్ట్రాల గణాంకాల ప్రకారం కోవిడ్-19తో మరణించిన రోగుల సగటు వయస్సు 30-45 అని తెలుస్తున్నది. దీనిని బట్టి 45 ఏండ్లు దాటిన ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు టీకాలను వేసుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారని విధితం అవుతున్నది. టీకా వేసుకున్న వారికి కరోనా సోకినా త్వరగా కోలుకున్నారని, వెంటిలేటర్లు, ఆక్సీజన్ సిలిండర్ల అవసరం లేకుండానే ప్రాణాపాయం నుంచి బయట పడ్డారని తెలుస్తున్నది. 3వ అల నుంచి రక్షణ పొందడంలో వ్యాక్సినేషన్ మాత్రమే ప్రధానమైనదని గుర్తించాలి. జూలై-ఆగష్టు వరకు ప్రజలకు, ముఖ్యంగా ప్రజలతో సంబంధం కలిగి ఉండే వారికి (వల్నరబుల్ సెక్షన్) సత్వరమే టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలి. టీకాలు వేయడానికి క్షేత్ర స్థాయి సూక్ష్మ ప్రణాళికలు అవసరం అవుతాయి. హెల్త్/ఆశ వర్కర్లు, అంగన్ వాడీలు ఇంటింటికీ తిరిగి టీకాకు అర్హతలు కలిగిన వారి జాబితాలను తయారు చేసి సిద్ధంగా ఉంచాలి. రోజుకు కనీసం 10 మిలియన్ల టీకాలు వేసేలా ఏర్పాట్లు చేయాలి. 2వ అలకు, 3వ అలకు మధ్య వ్యవధి చాలా ముఖ్యమైంది. ఈ సంధి కాలంలోనే కరోనా పరీక్షలను శాస్త్రీయంగా చేసుకుంటూ, 7 రోజుల 'టెస్ట్ పాజిటివ్ రేట్' 5 శాతం లోపు ఉండేలా నియంత్రించుకోవాలి. కరోనా కొత్త వేరియంట్లకు సంబంధించిన సమాచార నిర్ధారణకు 'జీనోమిక్ సీక్వెన్సింగ్' పరిశోధనలు తీవ్రతరం చేయాలి. సకాలంలో కోవిడ్-19 బాధితులను గుర్తించడం, క్వారంటైన్ చేయడం, ఖచ్చితమైన కరోనా కేసులు మరియు మరణాలను బయట పెట్టడం తప్పక జరగాల్సిందే. కరోనా కేసులు, మరణాల వివరాలను దాచిపెడుతూ, తక్కువ చూపడంతో కోవిడ్-19 విధ్వంసాన్ని ఖచ్చితంగా అంచనా వేయడం, తగు ఏర్పాట్లు చేయడం కుదరదు. జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో కరోనా కేసులు/మరణాలు/రికవరీల వివరాలను ఖచ్చితంగా సేకరించి భవిష్యత్ ప్రణాళికలు, వనరుల సమీకరణ జరగాలి. ఖచ్చితమైన సమాచారమే తగు జాగ్రత్తలు తీసుకోవడానికి, కరోనా కట్టడికి దోహదపడతాయని గుర్తుంచుకోవాలి.

2వ అల వేగంగా వ్యాప్తి చెందడం, కొద్ది రేజుల్లోనే తీవ్ర అనారోగ్యం కలగడం లాంటివి మనకు పలు హెచ్చరికలు చేస్తున్నాయి. ప్రజలు గుమిగూడడక పోవడం, విద్యాలయాలు తెరవకపోవడం, సోకిన వారిని సత్వరమే గుర్తించడం, సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడం, మాస్కులు వాడడం, సామాజిక దూరాలు పాటించడం, కోవిడ్-19 పాజిటివ్‌లను వేరు చేయడం త్వరత్వరగా జరగాలి. రోజువారీ కరోనా వివరాలు ప్రకటించడం, తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల ప్రజలను చైతన్యపరచడం, ప్రజల్లో ధైర్యాన్ని నూరిపోయడం, సమాజ ప్రవర్తనలో మార్పు రావడం తప్పక జరగాలి. 3వ వేవ్ తాకిడికి పిల్లలు గురి కావచ్చనే హెచ్చరికలు తీవ్రమైనవిగా పరిగణించి కావలసిన వైద్య ఏర్పాట్లు చేయాల్సి ఉంది. పెడియాట్రిక్ ఐసియూలు, సంక్లిష్ట రుగ్మతలను నయం చేయగల పిల్లల వైద్యులు, పిల్లల ఆసుపత్రి పడకలు పెంచాల్సిన అవసరం ఉన్నది. కోవిడ్-19 నోకి బయట పడిన వారు కూడా పలు శారీరక, మానసిక తీవ్ర దుష్ప్రభావాలను అనుభవిస్తున్నారు. గ్రామీణ ప్రజల్ని కాపాడటానికి ప్రత్యేకమైన స్థానిక మౌళిక వసతులను, మానవ వనరులను ఏర్పాట్లు చేయాల్సిన అత్యవసర స్థితి వచ్చిందని ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ సంక్షోభ సమయాన ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా జరుగబోయే నష్టానికి ప్రభుత్వాలే బాధ్యతలను తీసుకోవలసి ఉంది. వ్యాధి చికిత్స కన్న నివారించడమే మిన్న అనే సూత్రాన్ని పుణాదిగా చేసుకొని 3వ అల చుట్టేస ముందే పటిష్ట శాస్త్రీయ నివారణ చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఆరోగ్య తెలంగాణే ధ్యేయం

-కరీంనగర్‌లో టీ-హబ్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ జూన్ 10: ఆరోగ్య తెలంగాణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, వారిపై ఆర్థిక భారం పడకూడదనే టీ-హబ్ సెంటర్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో తెలంగాణ రోగ నిర్ధారణ కేంద్రం (టీ-హబ్)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పేదలకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేసి, లక్షణాలను కనుగొని పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా ఇలాంటివి లేవన్నారు. ఇందులో 57 రకాల రక్త పరీక్షలను ఉచితంగా చేస్తున్నారని, వీటి విలువ ప్రైవేట్ దవాఖానాల్లో అయితే రూ.10వేల వరకు ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు రూట్ మ్యాప్‌లను ఏర్పాటు చేశామని, ఇందులో గంగాధర, జమ్మికుంట, హుజూరాబాద్ ఉన్నాయని తెలిపారు.

ప్రతిరోజూ అక్కడి నుంచి శాంపిళ్లను కలెక్ట్ చేసి టీ- హబ్‌కు తరలించి అదేరోజు పరీక్షా ఫలితాలను ఇస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పీహెచ్‌సీతోపాటు సబ్ సెంటర్లు, సీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది శాంపిళ్లను సేకరిస్తారని, ఎలాంటి వ్యాధి అనుమానిత లక్షణాలున్నా రక్త నమూనాలు ఇవ్వాలన్నారు. పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి మందులను వైద్యులు అందజేస్తారని చెప్పారు. రూ.2 కోట్లతో నిర్మించిన టీ-హబ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీ-హబ్ నిర్వహణ కోసం ప్రతినెలా రూ.15 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. అనంతరం గంగుల కమలాకర్ హిమోగ్లోబిన్ పరీక్ష చేసుకున్నారు. మంగళ, బుధవారాల్లో ఒకే ఫలితం రావడంతో ఫలితాలు నాణ్యతగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మేయర్ వై సునీల్‌రావు, కలెక్టర్ శశాంక, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జువేరియా, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల, ఆర్ఎంవో డాక్టర్ శౌరయ్య, వైద్యులు శ్రీనివాస్, పద్మ, నవీన, వసీం, రవీందర్‌రెడ్డి, సమీర్, సుధాకర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, నాయకులు చల్ల హరిశంకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నలను ప్రభుత్వమే కొంటుంది

-వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్ జూన్ 9: రైతులు పండించిన జొన్నలను ప్రభు త్వమే కొనుగోలు చేస్తుందని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డితో కలిసి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నలు క్వింటాలుకు రూ.2620 చెల్లించి కొంటా మన్నారు. రైతులు పండించిన మొత్తం పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల వారీగా తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. రైతులు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రతి పక్షాల నాయకులు తప్పుదోవ పట్టించేందుకు ఆరోపణలు చేస్తు న్నారని, రైతులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు జొన్నలు తెచ్చిన రైతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం పుల్ల య్య, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

జైనథ్, జూన్ 9: మండల కేంద్రంలోని మార్కెట్ యా ర్డులో బుధవారం ఎంపీపీ మార్కెట్టి గోవర్ధన్ జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం క్వింటాలు జొన్నలను రూ. 2620 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జొన్నలు కొనుగోలుకు సమ్మతించిన సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే జోగురామన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఎస్. లింగారెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తుమ్మల వెంకట్‌రెడ్డి, సీఈవో గంగన్న, సర్పంచ్ దేవన్న, ఆలయ కమిటీ చైర్మన్ పుంధ్రు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సుదర్శన్, అధికారు లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తున్నదని రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు ఎలాంటి పంటను పం డించినా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ దేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ నాయ కులు రైతులను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి టీఆర్ఎస్ నా యకులపై ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం జొన్న కొనుగోలుకు ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావ్, రాష్ట్ర డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి సీఎం కేసీఆర్‌కు పలుమార్లు విన్నవించారని పేర్కొన్నారు. ఇందు కు ముఖ్యమంత్రి సమ్మతించినట్లు తెలిపారు. సమావేశం లో మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, ఆత్మ చై ర్మన్ జిట్టా రమేశ్, నాయకులు సెవ్వ జగదీశ్, దారుట్ల జీ వన్, మల్లేశ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ రైల్వేలకు 700 మెగాహర్ట్ జ్ బ్యాండ్‌లో 5 మెగా హర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను కేటాయింపునకు ఆమోదం

హైదరాబాద్ , జూన్ 10:రైల్వే స్టేషన్ ల పరిసరాల వద్ద, రైలుబండ్లల లోను సార్వజనిక భద్రత ను, సురక్ష సేవల ను దృష్టి లో పెట్టుకొని 700 మెగా హర్ట్ జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్ లో 5 మెగా హర్ట్ జ్ స్పెక్ట్రమ్ ను భారతీయ రైల్వేలకు కేటాయించే ప్రతిపాదన కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' కు ప్రోత్సాహాన్ని అందించేందుకు గాను ఈ చర్య ను తీసుకోవడమైంది.

ఈ స్పెక్ట్రమ్ తోనే భారతీయ రైల్వేలలు తన కు చెందిన మార్గాల లో ఎల్ టిఇ (లాంగ్ టెర్మ్ ఇవొల్యూషన్) ఆధారిత మొబైల్ ట్రేన్ రేడియో కమ్యూనికేషన్ ను అందించాలని ఆశించడమైంది.

ఈ ప్రాజెక్టు తాలూకు అంచనా పెట్టుబడి 25,000 కోట్ల రూపాయలకు పైగానే ఉంది. రాబోయే 5 సంవత్సరాల లో ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది.

దీనికి అదనం గా, దేశీయం గా అభివృద్ధి అయినటువంటి ట్రేన్ కలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ (టిసిఎఎస్) కు భారతీయ రైల్వేలు ఆమోదం తెలిపింది. ఇది రైలుబండి ప్రమాదం బారిన పడకుండా కాపాడడం లో సాయపడనుంది. అంతేకాకుండా దీని వల్ల ప్రయాణికుల భద్రత కు కూడా పూచీ లభిస్తుంది.

దీని తో రైల్వేల కార్యకలాపాలలోను, నిర్వహణ వ్యవస్థ లోను వ్యూహాత్మకమైనటువంటి బదలాయింపు చోటు చేసుకోగలదు. ఇది ప్రస్తుత మౌలిక సదుపాయాల ను ఉపయోగించుకొంటూ ఎక్కువ రైళ్ల ను సమకూర్చుకోవడం కోసం లైన్ కెపాసిటీ ని పెంచుకోవడం లో, భద్రత ను మెరుగుపర్చడం లో తోడ్పడగలదు. ఆధునిక రైల్ నెట్ వర్క్ రూపు దాల్చడం తో రవాణా వ్యయం తగ్గి, అధిక సామర్థ్యం అందిరాగలదు. అలాగే, ఇది 'మేక్ ఇన్ ఇండియా' మిశన్ ను నెరవేర్చడం లోను, ఉపాధి అవకాశాల ను అందించడం లోను బహుళ జాతీయ పరిశ్రమల ను వాటి తయారీ యూనిట్ లను ఏర్పాటు చేసేటట్టు ఆకర్షించనూగలదు.

భారతీయ రైల్వేల కు ఎల్ టిఇ ని అందించడం లోని ఉద్దేశమల్లా నిర్వహణ, భద్రత, సురక్ష తో ముడిపడ్డ ఏప్లికేశన్స్ కోసం సురక్షితమైన, బరోసా ఉంచదగ్గ వాయిస్, వీడియో, డేటా కమ్యూనికేశన్ సేవల ను అందించడమే. ఆధునిక సిగ్నలింగ్, రైలు సురక్షప్రణాళిక ల కోసం దీని ని ఉపయోగించడం జరుగుతుంది. అంతే కాకుండా లోకో పైలట్ లు, గార్డుల మధ్య నిరాటంకమైన కమ్యూనికేశన్ కు పూచీ పడడానికి గాను కూడా దీని ని ఉపయోగిస్తారు. ఇది రైలు బండి తాలూకు సురక్షత కు, వేగవంతమైన కార్యకలాపాల కు పూచీ పడడం లో ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఆధారిత రిమోట్ ఎసెట్ మానిటరింగ్ కు, ప్రత్యేకించి కోచ్ లు, సరకు ల బండ్లు, లోకో ల పర్యవేక్షణ, రైలు పెట్టెల లో సిసిటివి కేమరా ల లైవ్ వీడియో ఫీడ్ కు వీలు కల్పించగలదు.

దీని కోసం భారత టెలికం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) సిఫారసు చేసిన ప్రకారం కేప్టివ్ యూస్ కు గాను రాయల్టీ చార్జీలు, లైసెన్స్ ఫీ కోసం టెలికమ్యూనికేశన్స్ విభాగం నిర్ణయించిన ఫార్ములా ఆధారం గా స్పెక్ట్రమ్ చార్జీల ను విధించే అవకాశం ఉంది.

ఏపీలో జూలైలో ఇంటర్, డిగ్రీ పరీక్షలు?

అమరావతి, జూన్ 10:కరోనా కేసులు తగ్గుముఖం పడుతుండటంతో జూలైలో పరీక్షలు నిర్వహించాలని ఏపీ విద్యాశాఖ భావిస్తోంది. పరిస్థితులు అనుకూలంగా ఉంటే వచ్చే నెలలో ఇంటర్, ఇంజినీరింగ్, డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్ పరీక్షలకు 10 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరవుతారు. పరీక్షల నిర్వహణకు 15 రోజుల ముందు షెడ్యూల్ ప్రకటించాలి. ఈ నెల 20 వరకూ కర్ఫ్యూ ఉంది. ఆ తర్వాత వైద్యశాఖ అధికారుల సూచనలతో పరీక్షల సమయాన్ని ప్రకటించాలని భావిస్తున్నారు. వచ్చే నెల ఇంటర్ పరీక్షలు పూర్తయితే ఆగస్టులో ఇంజినీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ, ఇతర ఉమ్మడి పోటీ పరీక్షలు ఉంటాయి. సెప్టెంబరులో తరగతులు ప్రారంభించాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తోంది.

మరోవైపు ఇంజినీరింగ్ చివరి సెమిస్టర్ విద్యార్థులకు తొలుత పరీక్షలుంటాయి. విద్యార్థుల వెసులుబాటుకు రెండు పర్యాయాలుగా పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. వచ్చే నెలలో ఒకసారి, అప్పుడు రాలేని వారికి మరోసారి పరీక్షలు పెడతారు. ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన వారు, ఉన్నత చదువులకు వెళ్లాలనుకునేవారు మొదట పరీక్షలు రాయొచ్చని అధికారులు భావిస్తున్నారు. పరీక్షలు జాప్యమైతే వీరికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నందున రెండు విడతల పరీక్షల విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులకూ ఇదే విధానం అమలు చేయాలని భావిస్తున్నారు.

రూ.785 కోట్లు: బీజేపీకి బడా కంపెనీల భారీ విరాళాలు..

హైదరాబాద్ , జూన్ 10:2019-20లో బిజెపికి వివిధ కంపెనీలు, వ్యక్తుల నుంచి రూ.785.77 కోట్ల మేర విరళాలు అందాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి ఆ పార్టీ సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్‌కు అందిన విరళాలకంటే ఐదు రెట్లు ఎక్కువ. ఈ మొత్తంలో డిఎల్ఎఫ్ లిమిటెడ్, భారతీ ఎయిర్‌టెల్, జిఎంఆర్ ఎయిర్ పోర్టు డెవలపర్స్ ఇతర బడా కార్పోరేట్ సంస్థలతో కూడిన ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు నుంచి రూ.217 కోట్ల మొత్తం అ

రాజధానిగా విశాఖ నుంచే పాలన: బొత్స

అమరావతి, జూన్ 10:మూడు రాజధానుల అంశానికి సంబంధించి మంత్రి బొత్స సత్యనారాణ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో పరిపాలనా వికేంద్రీకరణ బిల్లు పెట్టినప్పుడే రాజధానిగా విశాఖ ప్రక్రియ ప్రారంభమైందని స్పష్టం చేశారు. దుష్ట శక్తులు న్యాయస్థానాలకు వెళ్లి ఆలస్యం చేసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. న్యాయప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరలోనే అన్ని అడ్డంకులు దాటుకుని పరిపాలన రాజధానిగా విశాఖ నుంచి పాలన సాగనుందని చెప్పారు. కోవిడ్ తర్వాత సమావేశాలు ఎక్కడి నుంచైనా నిర్వహించుకోవచ్చు అని వ్యాఖ్యానించారు.

ఏపీ సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలపై మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా స్పందించారు. సీఎం ఢిల్లీ పర్యటనపై రాజకీయం తగదని ఆయన అన్నారు. రాష్ట్రానికి నిధుల కోసమే జగన్ ఢిల్లీ వెళ్లారని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు సలహాలు ఇవ్వకుండా.. విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జగన్ సర్కార్ అమలు చేస్తోందన్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని బొత్స తెలిపారు. వ్యాక్సిన్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని మంత్రి బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలయ్యకు క్రికెటర్ యువరాజ్ సింగ్ స్పెషల్ విషెస్

హైదరాబాద్ , జూన్ 10:నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా ఎంతోమంది ఆయనకు విషెస్ తెలుపుతున్నారు. అభిమానులతో పాటు సినీ రాజకీయ ప్రముఖులు కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ సైతం నందమూరి బాలకృష్ణ కు విషెస్ తెలిపారు. సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసి మరింత స్పెషల్ గా విషెస్ తెలిపారు.

బాలకృష్ణ సార్ కి బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నాను? అలాగే తన ఎంటర్టైనింగ్ పర్ఫార్మెన్స్ తో ఎప్పుడూ ప్రపంచాన్ని అలాగే సామాజిక కార్యక్రమాలతో మరింత మందిని ప్రభావితం చేయాలని కోరుకుంటున్నాను అంటూ ట్విట్టర్ ఖాతా ద్వారా విషెస్ తెలిపారు. యువరాజ్ సింగ్ లాంటి స్టార్ క్రికెటర్ కి విషెస్ చెప్పడం పట్ల బాలయ్య అభిమానులు పండగ చేసుకుంటున్నారు.

నాలాల్లో పూడిక తొలగింపునకు రూ.45 కోట్లు

హైదరాబాద్ , జూన్ 10:జంట నగరాల పరిధిలోని నాలాల్లో 221 కిలో మీటర్ల మేర పూడిక తొలగింపునకు రూ.45 కోట్లు వెచ్చించనున్నట్టు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గం రాంగోపాల్‌పేట డివిజన్ రాష్ట్రపతి రోడ్డులో దర్గా వద్ద రూ.2.35 కోట్లతో చేపట్టిన నాలా వంతెన నిర్మాణపు పనులను ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. వంతెన నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, నాలాల్లో పూడిక తొలగింపు పనుల విషయంపై ఈ నెల 11న జీహెచ్ఎంసీ కార్యాలయంతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్ కుమార్‌లు పాల్గొంటారని చెప్పారు. 124 ప్రాంతాలలో 221 కిలో మీటర్ల మేర నాలాల్లో పూడిక తొలగింపు పనులను చేపట్టినట్టు తెలిపారు.

నాలాల్లో పూడిక తొలగింపు వలన రానున్న వర్షాకాలంలో నాలాల్లోకి వచ్చే నీరు సాఫీగా వెళ్తుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో నాలాలతో పాటు మురుగు కాల్వలను కలుపుకొని మొత్తం 884 కిలో మీటర్లు ఉన్నాయని తెలిపారు. నాలాల మరమ్మతులు, పూడిక తొలగింపు పనులను ఆరుగురు ఎస్ఈలతో పాటు ఆయా ప్రాంతాల జోనల్ కమిషనర్లు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక మాన్‌సూన్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం 128 మినీ మొబైల్ టీంలు, 68 డీసీఎం వాహనాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఒక్కో వాహనంలో నలుగురు సిబ్బంది ఉంటారన్నారు.

భారీ వర్షాలతో చెట్లు కూలిపోడవం, వర్షం నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులను గురిచేసే పరిస్థితులు నెలకొంటే వారికి కేటాయించిన ప్రాంతాలలో ఈ టీంలు చేరుకొని సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. గత యేడాది కురిసిన వర్షాలకు జీహెచ్ఎంసీ పరిధిలో బీటీ, సీసీ రోడ్లు దెబ్బ తిన్నాయని తెలిపారు. 182 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు మరమ్మతు పనులను రూ.52 కోట్లతో చేపట్టగా, ఇప్పటికి 100 కిలో మీటర్ల పనులు జరిగాయని చెప్పారు. అదే విధంగా 753 కిలో మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం పనులు 204 కోట్లతో చేపట్టగా, ఇప్పటి వరకు 272 కిలో మీటర్ల వరకు పనులు పూర్తి అయినట్టు చెప్పారు.

అంతే కాకుండా, బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, డ్రెయిన్ మరమ్మతులు రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, చైన్‌లింక్ మేష్ వంటి 468 పనులను 298 కోట్లతో చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో 16 కోట్లతో 42 పనులు పూర్తి అయినట్టు వెల్లడించారు. 211 పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మిగిలిన 147 పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ యేడాది చివరి వరకు ఈ పనులన్నింటిని పూర్తి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ ముకుందరెడ్డి, ఈఈ శివానంద్, జలమండలి జీఎం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పోలీసులు అంకితం కావాలి

వరంగల్ , జూన్ 10: పోలీసులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల సేవకు అంకితం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి పోలీసులకు పిలుపునిచ్చారు. గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పోలీస్ కమిషనర్ ముందుగా ఈస్ట్ జోన్ డి.సి.పి వెంకటలక్ష్మి , మామూనూర్ ఎ.సి.పి నరేష్ కుమార్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్.ఐ సురేష్ తో కలిసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సన్నిహిత కౌంటర్ పనితీరుపై సీపీ సంబంధిత సన్నిహిత కౌంటర్ ఇంచార్జిని వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ ఐటీ కోర్ విభాగం పనితీరుపై ఆరా తీసారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మార్కెటింగ్ సీజన్ 2021-22కుగాను ఖరీఫ్ పంటలకు మద్దతు ధర

న్యూఢిల్లీ, జూన్ 10:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ ఇవాళ సమావేశమైంది. ఈ సందర్భంగా దేశంలో 2021-22 మార్కెటింగ్ సీజన్‌లో అధీకృత ఖరీఫ్ పంటలన్నిటికీ కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను పెంచే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ఆయా పంటలు సాగుచేసిన రైతులకు దిగుబడిపై గిట్టుబాటు ధర లభ్యతపై భరోసా ఇస్తూ 2021-22 మార్కెటింగ్ సీజన్‌కుగాను ప్రభుత్వం ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను పెంచింది. ఈ మేరకు నిరుటితో పోలిస్తే 'నువ్వు' పంట మద్దతు ధర (క్వింటాలుకు రూ.452) అత్యధికంగా పెంచుతూ కమిటీ సిఫారసు చేసింది. అటుపైన 'కంది, మినప' పంటలకు అత్యధికంగా (క్వింటాలుకు రూ.300 వంతున) పెంచాలని సూచించింది. అలాగే నూనె గింజల్లో వేరుసెనగ, వెర్రి నువ్వులు (నైగర్ సీడ్)లపై క్వింటాలుకు రూ.275, రూ.235 వంతున పెరిగింది. పంటల సాగులో వైవిధ్యం దిశగా రైతులను ప్రోత్సహించే లక్ష్యంతో కమిటీ ఈ సిఫారసులు చేసింది.

-కూలీలు, దున్నకం, యంత్రాల వ్యయం, భూమి కౌలు, విత్తనాలు, ఎరువులు, సూక్ష్మ పోషకాలు, నీటి తీరువా, వ్యవసాయ ఉపకరణాలు, భవనాలపై తరుగుదల, నిర్వహణ మూలధనంపై వడ్డీ, పంపుసెట్ల కోసం డీజిల్/విద్యుత్ వినియోగంసహా ఇతరాలతోపాటు కుటుంబ శ్రమ కూడా ఇందులో అంతర్భాగంగా ఉంటాయి.

లోగడ 2018-19 కేంద్ర బడ్జెట్ సమర్పణ సమయంలో- దేశవ్యాప్త సగటు ఉత్పత్తి వ్యయం (సీఓపీ)తో పోలిస్తే ఒకటిన్నర రెట్లు అధికంగా కనీస మద్దతు ధర నిర్ణయిస్తామన్న ప్రకటనకు అనుగుణంగా, రైతుకు గిట్టుబాటు ధర లభ్యత లక్ష్యంగా ప్రభుత్వం నేడు 2021-22 మార్కెటింగ్ సీజన్ ఖరీఫ్ పంటల మద్దతు ధరలను పెంచింది. ఈ నేపథ్యంలో 'సజ్జ' పంటకు ఉత్పత్తి వ్యయంపై అత్యధికంగా (85 శాతం) ధర లభించనుందని అంచనా. అలాగే మినప (65 శాతం), కంది (62శాతం) పంటలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మిగిలిన పంటల విషయంలో ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతందాకా అధికంగా రైతుకు మద్దతు ధర లభించనుంది.

నూనె గింజలు, పప్పుదినుసులు, ముతక తృణధాన్యాల సాగుకు అనుకూలంగా కనీస మద్దతు ధరను సమన్వయం చేయడానికి కొన్నేళ్లుగా సంయుక్త కృషి సాగింది. ఇందులో భాగంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు, ఆధునిక పద్ధతులు అనుసరిస్తూ ఈ పంటలను మరింత ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా గిరాకీ-సరఫరాల మధ్య అసమతౌల్యాన్ని సరిదిద్దడానికి నడుం బిగించింది. భూగర్భ జలమట్టంపై దీర్ఘకాలిక ప్రతికూలత లేకుండా వరి-గోధుమ పండించలేని ప్రాంతాల్లో పోషకాలతో కూడిన, పోషక సమృద్ధ తృణధాన్యాలను సాగుచేయడాన్ని ప్రోత్సహించడంపై ప్రభుత్వ మరింతగా దృష్టి సారించింది.

దీంతోపాటు రైతులకు తమ ఉత్పత్తులపై గిట్టుబాటు ధర లభించడంలో వివిధ పథకాల సమాహారంగా ప్రభుత్వం 2018లో ప్రకటించిన "ప్రధానమంత్రి అన్నదాత ఆదాయం సంరక్షణ పథకం" (పీఎం-ఆషా) ఎంతగానో దోహదం చేస్తుంది. ఇందులో మూడు ప్రయోగాత్మక ఉప పథకాలు 'మద్దతు ధర పథకం', 'ధర లోటు భర్తీ పథకం', ప్రైవేటు కొనుగోళ్లు-నిల్వ పథకం' అంతర్భాగంగా ఉన్నాయి.

దేశంలో పప్పుదినుసుల ఉత్పత్తిలో స్వావలంబన లక్ష్యంగా రాబోయే 2021 ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం తగు వ్యూహాన్ని రూపొందించింది. తదనుగుణంగా కంది, పెసర, మినప పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి.. రెండింటినీ విస్తృతంగా పెంచడానికి సమగ్ర ప్రణాళికను రచించింది.

దీనికింద అంతరపంటగా, ఏకైక పంటగా సాగుద్వారా ఉత్పాదన పెంచడం కోసం అందుబాటులోగల అన్నిరకాల వంగడాల్లో అధిక దిగుబడినిచ్చే విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. అదేవిధంగా నూనెగింజల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రణాళికను ఆమోదించింది.

దీనికి అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే రకాల విత్తనాలను 2021 ఖరీఫ్ సీజన్లో రైతులకు 'మినీకిట్' రూపేణా ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఈ ఖరీఫ్ ప్రత్యేక కార్యక్రమం ద్వారా 6.37 లక్షల హెక్టార్ల మేర అదనపు భూమి నూనెగింజల సాగుకిందకు వస్తుంది. ఫలితంగా 120.26 లక్షల క్వింటాళ్ల నూనెగింజల ఉత్పత్తితో 24.36 లక్షల క్వింటాళ్ల వంటనూనెల లభ్యత సాధ్యమని అంచనా.

టీకా నిల్వల సమాచారానికి ఆరోగ్యమంత్రిత్వశాఖ వారి ఈవిన్ డేటా

న్యూఢిల్లీ, జూన్ 10:కోవిడ్ నియంత్రణలో భాగంగా జనవరి 16న దేశవ్యాప్తంగా చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని అమలు చేయటంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేస్తున్న కృషికి కేంద్రప్రభుత్వం అండగా నిలిచింది. సకాలంలో తగినన్ని టీకా డోసులు అందుబాటులో ఉండేలా కేంద్రం తగిన చర్యలు తీసుకుంటోంది. దీన్ని క్రమబద్ధం చేయటంలో రవాణా, నిల్వకు కూడా తగిన ప్రాధాన్యం ఇచ్చింది.

కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వారి ఈవిన్ లో టీకా డోసుల నిల్వ, వాటి ఉష్ణోగ్రత గురించి తెలియజేస్తూ రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు మంత్రిత్వశాఖ రాసిన లేఖకు కొన్ని మీడియా సంస్థలు ప్రాచుర్యం కల్పించాయి.టీకాల నిల్వల గురించి సమాచారాన్ని, విశ్లేషణాత్మక వివరాలను, నిల్వ ఉష్ణోగ్రతలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇతరులకు తెలియజేయవద్దని చెప్పటం వెనుక లక్ష్యం కేవలం ఆ సమాచారం దుర్వినియోగం కాకుండా చూడటమేనని మంత్రిత్వశాఖ వివరణ ఇచ్చింది. ఇతర సంస్థలు వాణిజ్యపరంగా దుర్వినియోగం చేసే ప్రమాదముందని హెచ్చరించింది.సార్వత్రిక టీకాల కార్యక్రమంలో భాగంగా ఒక నిర్దిష్ట టీకా ఎంతమంది ఏయే ప్రాంతాల్లో వాడుతున్నారనే సమాచారం వాణిజ్యపరంగా వెలుపలి సంస్థలకు ఉపయోగపడవచ్చుననే అనుమానంతోనే ఈ విధంగా హెచ్చరించాల్సి వచ్చినట్టు మంత్రిత్వశాఖ వివరణ ఇచ్చింది. దీనివలన టీకా మంది నిల్వలు ప్రభావితం కావచ్చునని భావిస్తోంది. టీకాల కార్యక్రమానికి సంబంధిమ్చిన పూర్తి సమాచారం కోసం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఈవిన్ డేతాను గత ఆరు నెలలుగా వాడుతున్న సంగతి తెలిసిందే. నిల్వలు, నిల్వల సమాచారం మీద అలాంటి సున్నితమైన సమాచారాన్ని బైటికి ఇవ్వదలచుకుంటే మంత్రిత్వశాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కోరుతోంది.కోవిడ్ టీకాల నిల్వ, వినియోగం, మిగులు తదితర అంశాలను కోవిన్ వేదికమీద కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఎప్పటికప్పుడు మీడియాకు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచుతూనే ఉంది. వారం వారం మీడియా సమావేశాలలోను , పత్రికాప్రకటనల ద్వారా వెల్లడిస్తూనే ఉంది. అయితే, సున్నితమైన సమాచారాన్ని బైటికి వెల్లడించవద్దని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాసింది.

పారదర్శకతకు పెద్దపీట వేయటంలో భాగంగా భారత ప్రభుత్వం ఐటి ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి లబ్ధిదారుని స్థాయిలో కూడా సమాచారం అందేలా కోవిన్ పోర్టల్ ను రూపుదిద్దిన విషయం తెలిసిందే.

అర్హులందరికీ రేషన్

తక్షణం పంపిణీకి సిద్ధంగా 5,353 కార్డులు

హైదరాబాద్ , జూన్ 10:జంట నగరాల పరిధిలో అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డులను అందించేందుకు గ్రేటర్ యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిశీలించి రాబోయే 15 రోజుల్లోగా రేషన్ కార్డులను మంజూరు చేయాలని మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం 1.77 లక్షల దరఖాస్తులు రాగా, 44,734 కార్డులను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 5,353 కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 99,014దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉందని సంబంధిత అధికారులు బుధవారం మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలకు వివరించారు. మాసబ్‌ట్యాంక్‌లోని మంత్రి తలసాని కార్యాలయంలో రేషన్ కార్డుల పంపిణీపై మంత్రులు సమావేశం నిర్వహించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ శ్వేతామహంతి, చీఫ్ రేషనింగ్ అధికారి బాల మాయాదేవి, హైదాబాద్ సివిల్ సప్లయి అధికారి రమేశ్ పాల్గొన్నారు.

పరిశీలనలో ఉన్న దరఖాస్తులు 48,498

జంట నగరాల పరిధిలో అర్హులైన పేదలకు వచ్చే వారం నుంచి నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి తలసాని అధికారులను ఆదేశించారు. నూతన రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ కోసం అవసరమైతే జీహెచ్ఎంసీ, రెవెన్యూ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. రేషన్ కార్డులలో మార్పుల కోసం 99,668 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 38,846 కార్డులు మార్పులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇంకా 48,498 రేషన్ కార్డుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

నూతనంగా మరో 32 షాపులు..

జంట నగరాల పరిధిలో 617 రేషన్ షాపులకు గాను 613 షాపులు పనిచేస్తున్నాయని, వివిధ కారణాలతో రేషన్ డీలర్లు మరణించిన కారణంగా 25 షాపులు పనిచేయడం లేదని అధికారులు మంత్రులకు వివరించారు. మరణించిన డీలర్ల కుటుంబ సభ్యులు ఆసక్తి చూపితే వారికే కేటాయించే వెసులుబాటు ఉన్నందున మరణించిన రేషన్‌డీలర్ల కుటుంబ సభ్యులను సంప్రదించి షాపు లు వారికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తలసాని అధికారులను ఆదేశించారు. మరో 32 నూతన షాపుల ఏర్పాటుకు వెసులుబాటు కల్పించినట్లు కమిషనర్ అనిల్‌కుమార్ మంత్రికి వివరించారు.

ఒక్కొక్కరికీ 15 కిలోల ఉచిత బియ్యం..

కరోనా నేపథ్యంలో ఒక్కొక్కరికి 15 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తలసాని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 5,80,584 రేషన్ కార్డులకు గానూ 33 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటి వరకు 2.40 లక్షల కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొన్ని ప్రాంతాలలో రేషన్ షాపులు లబ్ధిదారులకు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ఏఎస్‌వోలు కార్యాలయాలకే పరిమితం కాకుండా రేషన్ షాపులను తనిఖీలు చేపట్టాలని మంత్రి సూచించారు. బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా పర్యవేక్షణ జరపాలని అన్నారు. రేషన్ బియ్యం తీసుకొనే లబ్ధిదారులు బయో మెట్రిక్‌తో కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి పేర్కొనగా, ఐరిస్, ఓటీపీ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు.

సవరణ సహా కొత్త పెట్టుబడి విధానం (ఎన్ఐపి)-2012 ని రామగుండం ఫర్టిలైజర్స్ ఎండ్ కెమికల్స్ లిమిటెడ్‌కు కూడా వర్తించేటట్లుగా ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 10:ఎరువుల విభాగం తీసుకువచ్చిన ప్రతిపాదన కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సిసిఇఎ) ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం ప్రకారం, 2014 అక్టోబరు 7వ తేదీ నాటి సవరణ సహితం గా కొత్త పెట్టుబడి విధానం (ఎన్ఐపి)-2012 ఇకపై రామగుండం ఫర్టిలైజర్స్ ఎండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్ సిఎల్) విషయం లో కూడా వర్తింపు లోకి రానుంది.

ఆర్ఎఫ్ సిఎల్ అనేది ఒక జాయింట్ వెంచర్ కంపెనీ. దీని ని నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇంజినీయర్స్ ఇండియా లిమిటెడ్ (ఇఐఎల్), ఫర్టిలైజర్స్ కార్పొరేశన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఫ్ సిఐఎల్) లు కలసి ఏర్పాటు చేశాయి. దీనిని 2015 ఫిబ్రవరి 17న స్థాపించడమైంది. ఎఫ్ సిఐఎల్ కు చెందిన ఇదివరకటి రామగుండం యూనిటు ను ఆర్ఎఫ్ సిఎల్ పునరుద్ధరిస్తోంది. ఇందుకోసం గ్యాస్ పై ఆధారపడి పనిచేసేటటువంటి, వేప పూత సదుపాయం తో కూడిన యూరియా ను ఒక్కో సంవత్సరానికి 12.7 లక్షల మెట్రిక్ టన్ను ల మేర కు ఉత్పత్తి చేసే స్థాపిత సామర్థ్యం (ఎల్ఎమ్ టిపిఎ) కలిగిన ఒక గ్రీన్ ఫీల్డ్ (కొత్తది అయినటువంటి) ప్లాంటు ను ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఆర్ఎఫ్ సిఎల్ యూరియా ప్రాజెక్టు వ్యయం 6165.06 కోట్ల రూపాయలు గా ఉంది. ఈ ప్లాంటు కు గ్యాసు ను జిఎస్ పిఎల్ ఇండియా ట్రాన్స్ కో లిమిటెడ్ (జిఐటిఎల్) తాలూకు ఎమ్ బిబివిపిఎల్ (మల్లావరం-భోపాల్- బీల్ వాడా- విజయ్ పుర్ గ్యాస్ పైప్ లైన్) ద్వారా 'గేల్' (జిఎఐఎల్) సరఫరా చేస్తుంది.

యూరియా రంగం లో స్వయంసమృద్ధి ని సాధించడానికి గాను ఎఫ్ సిఐఎల్/ హెచ్ఎఫ్ సిఎల్ తాలూకు మూతపడ్డ యూరియా యూనిట్ లను పునరుద్ధరించడం కోసం ప్రభుత్వం చేపట్టిన ఒక కార్యక్రమం లో, గ్యాస్ పై ఆధారపడి పనిచేసేటటువంటి అత్యంత అధునాతనమైన ఆర్ఎఫ్ సిఎల్ ప్లాంటు ఒక భాగం గా ఉంది. రామగుండం ప్లాంటు ను ఆరంభం అయ్యిందంటే గనక, దేశం లో తయారు అవుతున్నటువంటి యూరియా కు 12.7 ఎల్ఎమ్ టిపిఎ సామర్థ్యం కలిగివుండే ఉత్పాదన ను జతపరచగలుగుతుంది. అంతేకాదు, యూరియా ఉత్పత్తి లో భారతదేశాన్ని 'ఆత్మనిర్భర్' (స్వయంసమృద్ధియుతమైంది)గా మలచాలి అన్న గౌరవనీయ ప్రధాన మంత్రి దార్శనికత ను నెరవేర్చడ లో సాయపడుతుంది కూడాను. ఆ ప్లాంటు దక్షిణ భారతదేశం లో అతి పెద్ద ఎరువుల తయారీ విభాగాలలోకెల్లా ఒక ప్లాంటు కాగలుగుతుంది. ఈ ప్రాజెక్టు రైతులకు ఎరువు అందుబాటు ను మెరుగుపరచడం ఒక్కటే కాకుండా దేశ ఆహార భద్రత కు పూచీ పడడం తో పాటు ఆ ప్లాంటు ఉన్నటువంటి ప్రాంతం లో రహదారులు, రైలు మార్గాలు, అనుబంధ పరిశ్రమల వంటి మౌలిక సదుపాయాల ను అభివృద్ధి పరచడం సహా ఆ ప్రాంతం లో ఆర్థిక వ్యవస్థ కు ప్రోత్సాహాన్ని సైతం ఇస్తుంది.

ఆర్ఎఫ్ సిఎల్ లో వివిధ అద్వితీయమైన అంశాలు ఉన్నాయి. వాటి లో యూరియా ఉత్పత్తి లో శక్తి ని ఆదా చేయడానికి గాను సింగిల్ ట్రేన్ లార్జెస్ట్ కెపాసిటీ యూరియా ప్లాంటు లలో కెల్లా అత్యధునాతనమైనటువంటి హెచ్ టిఇఆర్ (హోల్ దర్ టాప్ సే ఎక్స్ చేంజ్ రిఫార్మర్) సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమమైన యూరియా ప్రిల్స్ కు పూచీ పడేటటువంటి 140 మీటర్ల ఎత్తయిన ప్రిలింగ్ టావర్, ఒక్కో రోజు కు 4000 ఎమ్ టి యూరియా ను పంపగల సామర్థ్యం కలిగిన పూర్తి ఆటోమేటిక్ విధానం లో పనిచేసే బాగింగ్ ఎండ్ రైల్ / ట్రక్ లోడింగ్ ఫెసిలిటీ, ఎమ్ సిఆర్ (మెయిన్ కంట్రోల్ రూమ్) అమర్చిన డిసిఎస్ (డిస్ట్రిబ్యూటెడ్ కంట్రోల్ సిస్టమ్), ఇఎస్ డి (ఇమర్ జన్సి శట్- డౌన్ సిస్టమ్ ఫార్ ఇంప్రూవ్డ్ సేఫ్టీ ఎండ్ అవైలబిలిటి), ఆన్ లైన్ ఎమ్ఎమ్ఎస్ (మశీన్ మానిటరింగ్ సిస్టమ్స్), ఒటిఎస్ (ఆపరేటర్ ట్రేనింగ్ సైమ్యులేటర్), పర్యావరణ నిఘా వ్యవస్థ లు కొన్ని. ఈ వ్యవస్థల ను అత్యంత నిష్ఠ తో, సమర్పణ భావం కలిగివుండి, సుశిక్షితులైన ఆపరేటర్ ల ద్వారా నడిపించడం జరుగుతుంది.

తెలంగాణ తో పాటు భారతదేశం లోని ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర తదితర దక్షిణ ప్రాంత రాష్ట్రాల, మధ్య ప్రాంత రాష్ట్రాల యూరియా అవసరాల ను తీర్చాలి అనేది ప్రపంచంలోకెల్లా అతి ఉత్తమమైన సాంకేతికతల ను మేళవించుకొంటున్న ఈ సదుపాయం లక్ష్యం గా ఉంది. ఆర్ఎఫ్ సిఎల్ ద్వారా ఉత్పత్తి అయిన యూరియా విక్రయ బాధ్యత ను నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ తీసుకొంటుంది.

భారత ప్రభుత్వం ఎఫ్ సిఐఎల్ / హెచ్ఎఫ్ సిఎల్ లకు చెందిన మూతపడ్డ అయిదు యూనిట్ లను తిరిగి నడిపేందుకు తగినవి గా మార్చుతున్నది. ఈ పని ని రామగుండం (తెలంగాణ), తల్ చర్ (ఒడిశా), గోరఖ్ పుర్ (ఉత్తర్ ప్రదేశ్), సింద్రీ (ఝార్ ఖండ్), బరౌనీ (బిహార్) లలో ఒక్కొక్కటీ 12.7 ఎల్ఎమ్ టిపిఎ సామర్థ్యం కలిగివుండే కొత్త అమోనియా యూరియా ప్లాంటు ల ను ఏర్పాటు చేసి పూర్తి చేయడం జరుగుతుంది. దీనికై సుమారు 40,000 కోట్ల రూపాయల పెట్టుబడి తో అగ్రగామి ప్రభుత్వ రంగ సంస్థల కు చెందిన జాయింట్ వెంచర్ ల ను సిద్ధం చేయడం జరుగుతుంది. ఈ ప్లాంటు లు నిర్వహణ దశ కు చేరుకొంటే దేశీయ యూరియా ఉత్పత్తి 63.5 ఎల్ఎమ్ టిపిఎ మేరకు వృద్ధి చెందుతుంది. దీనితో యూరియా దిగుమతుల లో కోత సాధ్యపడి, విదేశీ మారక ద్రవ్యం భారీ మొత్తం లో ఆదా అవుతుంది; వీటి ద్వారా దేశం యూరియా రంగం లో స్వయంసమృద్ధి ని సాధించే దిశ లో ముందంజ వేయడానికి వీలవుతుంది, అది గౌరవనీయ ప్రధాన మంత్రి కన్న "

నకిలీ విత్తన రాకెట్‌ను చేధించిన కోదాడ పోలీసులు

సూర్యాపేట, జూన్ 10: : నకిలీ విత్తనాలను తయారు చేసి అమ్ముతూ అమాయక రైతుల్ని మోసం చేస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను కోదాడ పోలీసులు అరెస్టు చేశారు. రూ. 13.5 కోట్ల విలువైన కల్తీ విత్తనాలను ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేటలో జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ భాస్కరన్ ఈ రాకెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించారు.

హైదరాబాద్‌లోని వనస్థలిపురం కేంద్రంగా మూలపాటి శివారెడ్డి అనే వ్యక్తి ద్వారాకా సీడ్స్ పేరుతో గత కొంత కాలంగా కంపెనీ నిర్వహిస్తున్నడు. ఇతను గతంలో కర్ణాటక, తమిళనాడు మధ్యప్రదేశ్, ఇండోర్ ప్రాంతాల్లో పలు సీడ్స్ కంపెనీల్లో పని చేశాడు. ఆ అనుభవంతో ఇక్కడ కూడా ద్వారాకా సీడ్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసుకోని కాలం చెల్లిన, లేబుల్స్ లేకుండా, లాట్ నెంబర్ లేకుండా, లెసెన్స్ లేని డీలర్లతో నాణ్యత ప్రమాణాల ధ్రువీకరణ పత్రాలు లేకుండా హైబ్రీడ్ అంటూ మిర్చి, టమాట, బెండ, దొండ , పుచ్చకాయ లాంటి 15 రకాల నకిలి విత్తనాల్ని మార్కెట్ లో అమాయక రైతులకు అంటగడుతున్నారు.

బుధవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో వీటిని గుర్తించిన పోలీసులు లోతుగా విచారణ చేసి ఈ రాకెట్ ను ఛేధించారు. శివారెడ్డి మహబూబాబాద్, సుజాతానగర్, వత్సవాయి, వైరా ప్రాంతాల్లో కంపెనీలు ఏర్పాటు చేసి డీలర్లను నియమించుకోని ఈ దందా నడిపిస్తున్నాడు. ఈ దందాలో శివారెడ్డికి సహకరిస్తున్న ద్వారకా సీడ్స్ అకౌంటెంట్ యాదగిరి, రీజనల్ మేనెజర్ లక్ష్మా రెడ్డిలతో పాటు శివారెడ్డి నియమించుకున్న డీలర్లు ప్రతాప్ కుమార్, జగన్మోహన్ రావు, రమణలను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 986 కిలోల నకిలి విత్తనాలు స్వాదీనం చేసుకున్నారు. వీటి విలువ పదమూడున్నర కోట్ల రూపాయలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ నకిలీ విత్తనాల్ని అన్నింటిని వనస్థలిపురంలోని ఓ ఇంట్లో ప్యాక్ చేసి వివిధ ప్రాంతాలకు మధ్యవర్తుల ద్వారా సరఫరా చేసి శివారెడ్డి ఈ నకిలీ విత్తన దందా చేస్తునట్లు కలెక్టర్ వినయ్ క్రిష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలో ఎలాంటి నకిలీ విత్తనాలు అమ్మినట్లు కఠిన చర్యలు తప్పవని, వీడీ యాక్టు పెట్టి జైల్లో వేస్తామని హెచ్చరించారు.

అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈశాన్య ప్రాంతంలో ప్రోజెక్టుల అభివృద్ధికి ఇస్రో సహకరిస్తుందని వెల్లడించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జూన్ 10:ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈశాన్య ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులకు సహాయం చేస్తుందని, ఈశాన్య ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మెరుగుగా ముందుకు తీసుకెళ్లడానికి శాటిలైట్ ఇమేజింగ్ మరియు ఇతర స్పేస్ టెక్నాలజీ అనువర్తనాలను వాంఛనీయ వినియోగం అందించడం ద్వారా సహకరిస్తామని కేంద్ర ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి (డోనర్), పీఎంఓ, సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్షం శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు చెప్పారు.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఇస్రో శాస్త్రవేత్తలు పాల్గొన్న ఉన్నతస్థాయి సమావేశానికి కేంద్ర మంత్రి అధ్యక్షత వహించారు. ఇస్రో అమలు చేయడానికి ఇప్పటికే ఆరు ఈశాన్య రాష్ట్రాలు తమ ప్రతిపాదనలు పంపాయని, మరో రెండు రాష్ట్రాలు సిక్కిం, అసోం త్వరలోనే తమ ప్రతిపాదనలు పంపనున్నాయని మంత్రి చెప్పారు. కేంద్ర మంత్రిత్వ శాఖ నిధులతో మొత్తం 8 రాష్ట్రాల్లోని 221 సైట్లలో ఇస్రో ఇప్పటికే 67 ప్రాజెక్టులను పర్యవేక్షిస్తోందని, జియో-ట్యాగింగ్ కూడా చేస్తున్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలియజేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం డేటాను మ్యాపింగ్ చేయడంలో, పంచుకోవడంలో ఇస్రో సంస్థాగత ప్రమేయం ఉందని, ఇతర రాష్ట్రాలకు కూడా ఇది ఒక నమూనాగా మారగలదని, మొత్తం దేశంలో ఇదే మొదటిదని ఆయన అన్నారు. డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు మోడీ పాలనలో ఎన్నో కీలక అంశాలు అమలులోకి వచ్చాయని, గత ఏడు సంవత్సరాలలో, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రధానంగా ఉపగ్రహాల ప్రయోగానికి మాత్రమే పరిమితం కాలేదు, కానీ అభివృద్ధి కార్యకలాపాల్లో ఇది తన పాత్రను నిరంతరం విస్తరిస్తోంది అని ఆయన అన్నారు. తద్వారా ప్రధానమంత్రి నరేంద్రకు దార్శనికత అయినా ''ట్రాన్స్ఫార్మింగ్ ఇండియా'' సాకారం అయ్యేలా ఇవి సహకరిస్తున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (నేసాక్) కు ఈశాన్య రాష్ట్రాల నుండి అనేక ప్రతిపాదనలు వచ్చాయి. రాబోయే పక్షం రోజుల్లో ప్రతి రాష్ట్రాలతో ఒక్కొక్కటిగా ఇటువంటి ప్రాజెక్టుల సాధ్యత, వినతుల గురించి చర్చిస్తారు. గుర్తించిన తర్వాత, అటువంటి ప్రాజెక్టులన్నింటికీ ఆయా రాష్ట్రాలు మరియు నేసాక్ సంయుక్తంగా నిధులు సమకూర్చే అవకాశం ఉంది.కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఈ ఏడాది జనవరిలో షిల్లాంగ్‌ను సందర్శించి నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (నేసాక్) సొసైటీతో సమావేశం నిర్వహించినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అటవీ అంతరాల ప్రాంతాల మ్యాపింగ్, ఉద్యానవన అభివృద్ధికి భూభాగం విస్తరించడం, చిత్తడి నేలలను గుర్తించడం మరియు పునరుజ్జీవనం చేయడం మరియు వరదనీటిని మళ్లించడం, జీవనోపాధి అవసరాలకు వెదురు వనరులను అంచనా వేయడం వంటి పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడానికి హోంమంత్రి జూలైలో మళ్లీ కేంద్రాన్ని సందర్శించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. కోవిడ్ ప్రభావం ఉన్నప్పటికీ, ఈ ప్రాజెక్టుల అమలులో చాలా ప్రగతి ఉందని ఆయన అన్నారు.

ఈశాన్య ప్రాంతంలో, వ్యవసాయం, రైల్వేలు, రోడ్లు మరియు వంతెనలు, వైద్య నిర్వహణ / టెలిమెడిసిన్, సకాలంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ల సేకరణ, విపత్తు సూచన మరియు నిర్వహణ, వాతావరణం / వర్షం / వరద సూచనలతో సహా వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఆనకట్ట నిర్మాణం, వరద తగ్గించడం, మూడు మోడల్ గ్రామాలు, ఉద్యానవనం, సున్నా స్థాయిలో సరిహద్దు ఫెన్సింగ్ వంటి ప్రాంతాలలో అరుణాచల్ ప్రదేశ్ నుండి ఏడు ప్రాజెక్టులు పూర్తయ్యే దశలో ఉన్నాయని ఇస్రోకు చెందిన సీనియర్ అధికారులు మంత్రికి తెలియజేశారు. ఇతర రాష్ట్రాల నుండి ఇలాంటి ప్రాజెక్టులు కూడా లక్ష్యాన్ని సాధించే మార్గంలో ఉన్నాయి.

నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ అనేది షిల్లాంగ్ వద్ద అంతరిక్ష శాఖ ఆధ్వర్యంలోని ఒక స్వయంప్రతిపత్తి సంస్థ. ఎనిమిది రాష్ట్రాలతో కూడిన ఈశాన్య భారతదేశంలోని ఈశాన్య ప్రాంతానికి ప్రత్యేక సేవలను అందిస్తుంది. అంటే. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, మరియు త్రిపుర. సహజ వనరుల నిర్వహణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక, ఆరోగ్య సంరక్షణ, విద్య, అత్యవసర కమ్యూనికేషన్, విపత్తు నిర్వహణ మద్దతు, మరియు అంతరిక్షంపై అంతరిక్ష శాస్త్ర మరియు సాంకేతిక సహకారాన్ని అందించడం ద్వారా భారతదేశ ఈశాన్య ప్రాంతం సమగ్ర అభివృద్ధిలో ఉత్ప్రేరక పాత్ర పోషించే దృష్టితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ వైద్యం... నిరుపేదలకు వరం...

మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేతుల మీదుగా....

నేడే డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, జూన్ 10(నేటినిజం ప్రతినిధి): నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అత్యంత ఖరీదుగా మారుతోంది..... పేదలకు రోగం వస్తే తగ్గించుకోవడానికి అన్ని ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి..... జబ్బు చేసిందని ఆస్పత్రికి వెళితే సంబంధిత వైద్యులు పలు రకాల పరీక్షలు చేయాల్సి ఉంటుందని... ఆ పరికరాలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో లేదని చెబుతుండటంతో గత్యంతరం లేక పేదలు అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సివస్తుంది.. అసలే కరోనా కాలం ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోంది.. సాధారణ జ్వరం వచ్చినా రోగ నిర్ధారణ పరీక్షలకు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్లాల్సివస్తోంది.. ఈ ఆర్థిక భారం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రుల్లో డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.... వాటికి సంబంధించిన అత్యాధునిక యంత్రాలు అందుబాటులోకి తీసుకువచ్చారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పొదుపు భవన్ పక్కన సెంటర్ ను నెలకొల్పారు. నేడు ఉదయం 11.30 రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రివర్యులు కేటీఆర్ ప్రారంభించనున్నారు.

అత్యాధునిక యంత్రాలు

జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఫుల్లీ ఆటోమేటిక్ క్లినికల్ కెమిస్ట్రీ అనలైజర్,ఫుల్లీ ఆటోమేటిక్ ఇమ్యునో అస్సే అనలైజర్, ఫైన్ పార్టే సెల్ కౌంటర్, ఎలీసా రీడర్ అండ్ వాషర్,ఫుల్లీ ఆటోమెటిక్ యూరిన్ అనలైజర్ వంటి అత్యాధునిక సాంకేతికతతో కూడిన రోగ నిర్ధారణ పరీక్ష యంత్రాలున్నాయి. వీటితోపాటు ఈసీజీ, టుడీ ఈ కో, అల్ట్రాసౌండ్ డిజిటల్ ఎక్స్ రే, హాట్ ఎయిర్ ఓవెన్ ,ఇంక్యుబేటర్ పథాలజీ, బయోమెట్రిక్, ఇమేజింగ్ వంటి యంత్రాలను ఏర్పాటు చేశారు... పరీక్షల రకాలను బట్టి ఒక్కో మిషన్ గంటకు 400 నుండి 800 వరకు రిపోర్టులు అందిస్తాయి..

రోగ నిర్ధారణ పరీక్షలివే

మొత్తం 57 రకాల రోగనిర్ధారణ పరీక్షలు ఈ కేంద్రంలో చేపడుతున్నారు. థైరాయిడ్ ప్రొఫైల్, లిపిడ్, సిబిపి ,ఆర్ బి ఎస్, ఎల్ ఎఫ్ టి ,ఆర్ ఎఫ్ టి ,ఇఎస్ ఆర్ తో పాటు విభిన్న వ్యాధులకు సంబంధించిన 57 రకాల పరీక్షలు ఇందులో ఉన్నాయి.. బ్లడ్ టెస్ట్ ఇచ్చినా 24 గంటల్లో రోగనిర్ధారణ పరీక్ష చేసి సంబంధిత రోగి సెల్ ఫోన్ కు రిపోర్టు పంపిస్తారు.

జిల్లా ప్రజలకు ప్రయోజనం

జిల్లాలో షుగర్ వ్యాధి, రక్తపోటు, ఊపిరితిత్తుల, థైరాయిడ్, హృద్రోగాలు, మూత్రపిండాల వ్యాధులకు సంబంధించి వేలాది మంది బాధపడుతున్నారు. వీటికి తోడు కోవిడ్ నేపథ్యంలో రక్త మూత్ర పరీక్షలు తప్పనిసరి చేశారు.. దీంతో రోగులు పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్ ను ఆశ్రయించి, రూపాయలు 2,000 నుంచి 6,000 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుంది.ఈ టీ హబ్ ద్వారా ఇప్పుడు ఉచితంగానే పరీక్షలు పొందే సౌలభ్యం రావడంతో పేద సామాన్య వర్గాలపై భారం పూర్తిగా తగ్గనుంది.

నాణ్యమైన ఫలితాలు ఉచితంగా-జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుమన్ మోహన్ రావు

జిల్లాలో రోగులకు నాణ్యమైన 57 రకాల పరీక్షలు ఉచితంగా టీ హబ్ ద్వారా అందుతాయి. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రిల తరహా అత్యాధునిక పరికరాలు టీ హబ్ లో ఉన్నాయి. పరీక్షల రిపోర్టులను 24 గంటల్లో రోగులకు సెల్ ఫోన్ కు చేరుతాయి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి వారు కోరారు.

సికింద్రాబాద్ లోని ఎన్ఐఇపిఐడిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ (హాస్టల్ భవనం) వర్చువల్‌గా ప్రారంభించిన శ్రీ తావర్ చంద్ గెహ్లోట్

హైదరాబాద్ , జూన్ 10:సికింద్రాబాద్ లోని ఎన్ఐఇపిఐడిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ ను (హాస్టల్ భవనం) కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి శ్రీ తావర్ చంద్ గెహ్లోట్ వర్చువల్ గా ప్రారంభించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రులు శ్రీ కృష్ణ పాల్ గుర్జార్, శ్రీ రామదాస్ అథావాలే, శ్రీ రతన్ లాల్ కటారియా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంటు సభ్యుడు శ్రీ రేవంత్ రెడ్డి (మల్కాజ్ గిరి నియోజకవర్గం), దివ్యాంగుల సాధికారత శాఖ కార్యదర్శి శ్రీమతి అంజలి భావ్రా, జాయింట్ కార్యదర్శి డాక్టర్ ప్రబోధ్ సేథ్ కూడా ఈ వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. ఎన్ఐఇపిఐడి, సికింద్రాబాద్ డైరెక్టర్ శ్రీ బివి రామ్ కుమార్ గౌరవ అతిథులకు స్వాగతం పలికారు.

ఎన్ఐఇపిఐడి నిర్వహణలోని కోర్సులకు గల డిమాండును, విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించడానికి అదనపు హాస్టళ్ల అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని మంత్రిత్వ శాఖ అనుమతితో ఈ సంస్థ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ హాస్టల్ పేరిట కొత్త హాస్టల్ భవనం నిర్మించింది.ఆధునిక వసతులతో నిర్మించిన ఈ భవనంలో 50 మంది విద్యార్థులు బస చేయడానికి అవసరమైన గదులతో పాటు రెండు గెస్ట్ రూమ్ లు కూడా ఉన్నాయి. ఈ భవనాన్ని రూ.3.98 కోట్ల వ్యయంతో నిర్మించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని ప్రతీ ఒక్క రంగానికి చెందిన ప్రజల సర్వతోముఖాభివృద్ధికి కృషి జరుగుతోందని ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ తావర్ చంద్ గెహ్లోట్ అన్నారు. అలాగే దివ్యాంగుల సాధికారత శాఖ (డిఇపిడబ్ల్యుడి), ఎంఎస్ జెఇ కూడా దేశంలోని దివ్యాంగ జనుల సర్వతోముఖాభివృద్ధికి వేగంగా కృషి చేస్తున్నాయి.

ఈ లక్ష్యంతోనే దేశవ్యాప్తంగా దివ్యాంగ జనుల అభివృద్ధికి అభివృద్ధికి 9 జాతీయ సంస్థల ఏర్పాటు జరిగింది. వాటిలో ఒకటి సికింద్రాబాద్ లోని (తెలంగాణ) జాతీయ సంస్థ. దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి దివ్యాంగ విద్యార్థులు ఈ సంస్థలో విద్యాభ్యాసానికి వస్తారని శ్రీ గెహ్లోట్ చెప్పారు.

మరిన్ని వివరాలు అందిస్తూ వివిధ వైకల్యాలతో బాధ పడుతున్న దివ్యాంగుల సంక్షేమం, సుసంపన్నత కోసం వారిలో భౌతిక, ఆర్థిక, మేధో అభివృద్ధికి దోహదపడడానికి అవసరమయ్యే గాడ్జెట్లు, సామగ్రి, డివైస్ లు కూడా తాము అందిస్తున్నామని శ్రీ గెహ్లోట్ తెలిపారు. బధిరులైన విద్యార్థులకు కోక్లియర్ ఇంప్లాంట్లను ఉత్పత్తి చేసే ఒక్కో యూనిట్ కు తాము ఇప్పటివరకు రూ.6 లక్షల గ్రాంటు ఇస్తూ వస్తున్నామని, దాన్ని రూ.7 కోట్లకు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. బధిరులైన బాలబాలికల వినియోగానికి కోక్లియర్ ఇంప్లాంట్లను తీసుకునేందుకు, ఉచితంగా చేసిన ఈ సదుపాయం ఉపయోగించుకునేందుకు తమ మంత్రిత్వ శాఖ లేదా నోడల్ ఏజెన్సీలను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగ జనుల అభివృద్ధి కోసం 2016 సంవత్సరంలో ప్రభుత్వం కొత్త చట్టం రూపొందించిందని, అందులో దివ్యాంగ జనుల వర్గీకరణను 7 నుంచి 21కి పెంచిందని శ్రీ గెహ్లోట్ వివరించారు. దివ్యాంగ జనులు ఉద్యోగాలు, విద్యలో మెరుగైన రిజర్వేషన్ అవకాశాలు పొందేందుకు ఇది సహాయకారిగా ఉంటుందని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలోని ప్రభుత్వం దేశ ప్రజల కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కన్న పలు కలలు సాకారం చేస్తున్నదని ఈ సందర్భంగా శ్రీ రామ్ దాస్ అథావాలే తెలిపారు. దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఈ సంస్థకు వచ్చి విద్యాభ్యాసం చేసేందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం అవకాశం కల్పిస్తుందని ఆయన చెప్పారు.

ఈ హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన ఆధునిక వసతులు విద్యార్థులకు ప్రత్యేకించి ఈ కోవిడ్ కాలంలో మంచి వాతావరణం కల్పించడం ద్వారా విద్యార్థులు తమ విద్యాభ్యాసంపై దృష్టి సారించి కోర్సులు విజయవంతంగా పూర్తి చేయడానికి సహాయకారిగా ఉంటాయని తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కోవిడ్ మహమ్మారి విజృంభణ నేపథ్యంలో తన వృత్తిపరమైన కార్యకలాపాలు కొనసాగించేందుకు విధి విధానాల్లో ఎన్ఐఇపిఐడి విప్లవాత్మకమైన మార్పులు చేసిందని శ్రీ క్రిషన్ పాల్ గుర్జార్ అన్నారు. గత ఏడాది ఈ సంస్థ 150 వరకు వెబినార్లు నిర్వహించిందని, తద్వారా 1800 మంది నిపుణులు, వృత్తి నిపుణులు లబ్ధి పొందారని తెలిపారు.

దీనికి తోడు ఎన్ఐఇపిఐడి ఇ-లెర్నింగ్, ఇంటరాక్టివ్ క్లాస్ రూమ్ విధానాల ద్వారా పలు దీర్ఘకాలిక, స్వల్పకాలిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. ఆ రకంగా ఎన్ఐఇపిఐడి మానవ వనరుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ ఈ కోవిడ్ సమయంలో దివ్యాంగులకు సేవలందిస్తోంది.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయం..

రాజన్న సిరిసిల్ల, జూన్ 10(నేటినిజం ప్రతినిధి): రుద్రనీగి మండల కేంద్రములోని నిరుపేద కుటుంబానికి చెందిన సింగారపు రజిత వీరికి మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపాయలు 5000, మరియూ 25 కేజీల బియ్యం అందజేసి సేవా భావాన్ని చాటుకున్నారు ఈ నెల 24 న ఆమె మై వివాహానికి కూడా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరింత ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.ఇంకా ఎవరైనా నిరుపేదలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారికి కూడా తమ వంతు సహాయం అంజేయడానికి మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ముందుంటుందని తెలిపారు.తమ కుటుంబ పరిస్థితిని తెలుసుకొనిఆర్థిక సాయం చేసిన మై వేములవాడ చారిటబుల్ ట్రస్టుసభ్యులకురజిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుమ్మరి శంకర్,మధు మహేష్, నూగురి మహేష్,గొంగల్లా రవి కుమార్,తాళ్లపల్లి ప్రశాంత్,రేగుల రాము, రుద్రాంగి గ్రామ యువకులు సంద్యారాపు వెంకటేష్,పడాల గణేష్ చెప్యాల గణేష్,దయ్యాల పెద్దులు, విశాల్,గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

నిరంతరంగా కొనసాగుతున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సేవలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 10(నేటినిజం ప్రతినిధి): మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు' ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు గురువారం 24వ రోజుకు చేరాయి. ఈరోజు లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ వద్ద గల కొవిడ్ ఐసోలేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న పేషంట్లకు , ఆరోగ్య సిబ్బందికి, కోవిడ్ టెస్ట్ చేసే సిబ్బందికి, ఆలయ పరిధిలో ఉంటున్న అన్నార్థులకు మొత్తం ఈరోజు మధ్యాహ్నం 100 మందికి అన్నదానం చేయడం జరిగింది. . పలువురు దాతలు తమ సంతకు అండగా నిలుస్తున్నారని, అందరి సహకారంతో సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుమ్మరి శంకర్, మధు మహేశ్, నూగురి మహేష్, తాళ్లపెల్లి ప్రశాంత్, ప్రతాప నటరాజు , గొంగళ్ల రవికుమార్, మోతే అనిల్, ముంజ ఉమెందర్ , బింగి శ్రీనివాస్, తాటికొండ అనీల్, పవన్ కుమార్, కొప్పుల హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

రాజన్న సిరిసిల్ల, జూన్ 10(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మర్రి గడ్డ గ్రామం లో నకిలీ పత్తి విత్తనాలను నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు చందుర్తి ఎస్ఐ సునీల్, వ్యవసాయ అధికారి దుర్గరాజు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు, మర్రిగడ్డ గ్రామంలో ఆరే సాంబశివారెడ్డి అనే వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలను నిల్వచేసి అమ్మేందుకు సిద్ధం కాగా అందిన సమాచారం మేరకు విత్తనాలను పట్టుకుని సాంబశివ రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు, ఈ పత్తి విత్తనాలు సుమారు 5 క్వినీటళ్ల వరకు ఉంటాయని ఎస్ఐ తెలిపారు,

మరణించిన పోలీసు కుటుంబాలకు పూర్తి సహకారం అందిస్తాం--ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే

కరోనతో మరణించిన ఏ. ఆర్.ఎస్.ఐ కనకయ్య కుటుంబానికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా నాలుగు లక్షల చెక్ అందజేత

రాజన్న సిరిసిల్ల, జూన్ 10(నేటినిజం ప్రతినిధి): విధి నిర్వహణలో అకస్మాత్తుగా మరణించిన పోలీసు కుటుంబాలకు పూర్తి సహకారం అందిస్తామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా ఏ. ఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఏ. ఆర్.ఎస్.ఐ వీధులు నిర్వర్తిస్తూ ఇటీవలి కాలంలో విధి నిర్వహణలో కరోనా మహమ్మారి భారిన పడి మరణించిన ఏ. ఆర్.ఎస్.ఐ కనకయ్య కుటుంబానికి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా పోలీస్ భద్రత పథకం కింద నాలుగు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా మరణించిన వారి కుటుంబానికి ప్రభుత్వం తరుపున అందాల్సిన బకాయిలను త్వరితగతిన అందజేసే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆర్.ఆర్ లక్ష్మణరావు కనకయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు..

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీజిల్ ,పెట్రోల్ ధరల పెంపును నిరసిస్తూ ధర్నా

కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 10(నేటినిజం ప్రతినిధి): ఏఐసిసి, టిపి సిసి, ఆదేశాల మేరకు ఈ నెల 11న శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీజిల్, పెట్రోల్ ధరల పెంపును నిరసిస్తూ పెట్రోల్ పంపుల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ టి పిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేవలం 5 నెలలోనే ఎన్నోసార్లు పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం జరిగిందన్నారు. ఇతర ఏ వస్తువుల పై ధరలు పెరిగితే ఎంత ప్రభావం ఉండదని, కేవలం పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రతి నిరుపేద , మధ్యతరగతి పై మోయలేని భారం పడుతుందన్నారు. డీజిల్, పెట్రోల్ పెరగడం తో అన్ని రకాల ధరలు పెరిగిపోతున్నాయని, ఇది కేంద్ర తప్పిదామని అన్నారు. ఈ ప్రభుత్వాల హయాంలో ఇన్ని సార్లు పెట్రోల్ , డీజిల్ ధరలు పెరగలేదని అన్నారు. ఈ కరోనా సమయంలో ప్రజలు ఇంత ఇబ్బందుల్లో ఉన్న, కేంద్ర ప్రభుత్వం ప్రజల పక్షాన ఆలోచించకుండా ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతుందని ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం వలన ఆర్థిక మందగమనంవిపరీతమైన నిరుద్యోగం ,వేతనాల కోత ఉద్యోగ నష్టాలు మరియు అధిక ధరలు సమస్యలు ఉత్పన్నం అవుతాయని అన్నారు డీజిల్, పెట్రోల్ ధరల పెంపు కు నిరసనగా నేడు శుక్రవారం తేదీ 11ఉదయం11-00 గంటలకు వేములవాడ పట్టణంలోని పెట్రోల్ పంపుల దగ్గర ధర్నా కార్యక్రమాలు పుంటాయని, ఇట్టి ధర్నా కార్యక్రమానికి జిల్లా రాష్ట్ర అధికారులు నిర్దేశించిన కోవిడ్-19 ప్రోటోకాల్ కట్టుబడి ఉండాలని ,మాస్కు ధరించడం సామాజిక దూ